# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**AUGUST-2012**

సంవత్సర చందా రూ.50/-

సత్యవాణి-క్రీస్తుసంఘము

# బైబిల్ లెక్చర్‌షిప్

Bible Lectureship, Kakinada.

| | | |
|---|---|---|
| సమయం | : | **2012 నవంబరు 6,7,8 తేదీలు**<br>ఉదయం 10:00 గంటలకు.<br>మధ్యాహ్నం 3:00 గంటలకు.<br>సాయంత్రం 6:00 గంటలకు. |
| స్థలం | : | **సత్యవాణి - క్రీస్తుసంఘము**<br>7-9-35 సాంబమూర్తి వీధి<br>కుళాయిచెర్వు ఎదురుగా<br>కాకినాడ-533 004. |
| ప్రసంగీకులు | : | **క్రీస్తుసంఘము**లో పేరు గాంచిన<br>ప్రఖ్యాత అంతర్జాతీయ సువార్తికులు<br>మరియు స్వదేశ సువార్తికులు. |
| వసతి,భోజనము | : | ఉచితము;మొదట్లో 20/- రూ॥లు<br>రిజిస్ట్రేషన్‌ఫీజు చెల్లించవలెను. |

**మీరు కుటుంబ సమేతముగా రావచ్చును. దారిఖర్చులు ఎవరికి వారే భరించవలెను.మీరు వచ్చి ఆత్మీయముగా మేలు పొందండి.అందరికి ఆహ్వానము!అందరికిస్వాగతము!!**

ఫోన్:0884-2363722
-2363697

వందనములతో
**రిక్కీగూటం**
**జాషువాగూటం**

ఆత్మ అనుగ్రహించు అద్భుతవరములను మొదటి శతాబ్దపు సంఘస్థులు కలిగి యుండిరి. ఈ యాత్మ వరములు తొమ్మి దింటినిమనము 1కొరింధి 12:4-10 లోచూడగలము. అవేమనగా:బుద్ధివాక్యము (The Word of Wisdom), జ్ఞానవాక్యము (అద్భుతసంబంధమైన)విశ్వాసము,స్వస్థపరచు వరము,అద్భుతములు చేయు శక్తి, ప్రవచన వరము,ఆత్మలవివేచన,నానా విధ భాషలు, భాషల అర్ధము చెప్పుశక్తియను నవి.

ఆత్మసంబంధమైన ఈ అద్భుత వరములు యెవరికి అనుగ్రహింప బడెను?ప్రతి క్రైస్తవునికి ఈ అద్భుత వరములు ఈయబడెనని యెవరును తలంచరు.ప్రతి క్రైస్తవునికి అద్భుతములు చేయు శక్తిని దేవుడు ఇచ్చి యున్నాడని మనలో ఎవరును తలంచ కూడదు. అందు వలన ఈ ప్రత్యేక అద్భుతవరములు ఆదిమసంఘములో యెవరికి ఈయబడె నో మనము తెలిసికొనుట ప్రాముఖ్యమైన సంగతి.

అపొస్తలులుకార్యములు అను పుస్తకమును మనము బాగుగా చదివిన యెడల, పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందిన అపొస్తలులు తమ చేతులను యితరుల మీద ఉంచుట ద్వారా వారికి ఈ అద్భుత వరముల నను గ్రహించినట్లుమనము గ్రహించగలము. అపొస్తలులు కాకుండియు అద్భుతములు చేయగల్గిన ఇద్దరు మను ష్యులను గూర్చి మనము ఇక్కడ చెప్పుకొనవచ్చును. అపొ. కా. 6:8లో స్తెఫను కృపతోను, బలముతోను నిండిన వాడై ప్రజలమధ్య మహత్కార్యములను,గొప్ప సూచకక్రియ లను చేయుచుండెను అని వ్రాయబడి యున్నది. అపొ. కా. 8:6లో ఫిలిప్పు కూడ సూచక క్రియలను చేయుచుండెను అని మనకు కన్పడుచున్నది. అయితే అపొ. కా. 6:5,6 వచనములలో అపొస్తలులు ప్రార్ధన చేసివారిమీద చేతులుంచిన యేడుగురిలో స్తెఫను, ఫిలిప్పు ఉన్నట్లు మనము కనుగొన గలము. దీనిని బట్టి అపొస్తలులు ఎవరిమీద చేతులుంచిరో వారు ఆత్మసంబంధమైన అద్భుతవరము లను పొందినట్లు మనకు గ్రహింపగుచున్న ది. అయితే వీరు మరొకరికి ఈ వరమును మాత్రము అనుగ్రహించు శక్తి లేనివారని కూడ మనము చూడగలము.

ఉదాహరణకు: సమరయులు ఫిలిప్పుద్వారా దేవుని వాక్యమును అంగీకరించిన ఈ సంగతిని యెరూష లేములోని అపొస్తలులు విని, పేతురు ను,యోహానునువారి యొద్దకుపంపిరి. వీరు వచ్చి వారు పరిశుద్ధాత్మను పొంద వలెనని వారిపై చేతులుంచి ప్రార్ధన చేసిరి(అపొ. కా. 8:14-19). అపొస్తలులు చేతులుంచగా పరిశుద్ధాత్ముడు వారిపై

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33    ఆగష్టు -2012    సంచిక - 1

## పరిశుద్ధాత్మ వరములు

The Spiritual Gifts

గత రెండు పాఠములలో మనము పరిశుద్ధాత్మ బాప్తిస్మము గూర్చి తెలిసికొంటిమి. అపొస్తలులును, కొర్నేలి యింటివారును మాత్రమే పరిశుద్ధాత్మలో బాప్తిస్మముపొందిరియని గమనించితిమి. అపొస్తలులు దేవుని వాక్యమును బోధించి నంతకాలము దానిని బట్టి వారు అనేక అద్భుతములు, సూచక క్రియలు చేయ గల్గిరి. అందువలన దేవుని వాక్యము స్థిరపరచబడెను. పరిశుద్ధాత్మబాప్తిస్మము పొందిన తరువాత అపొస్తలులు "బయలు దేరి వాక్యమంతట ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి, వెనువెంట జరుగుచు వచ్చిన సూచకక్రియల వలన వాక్యమును స్థిరపరచుచుండెను, ఆమెన్" అని మార్కు16:20లో మనకు తెలియజేయబడినది.

అయితే అపొస్తలులు కానివారు కొందరు అద్భుతములను, సూచక క్రియలను చేసినట్లు క్రొత్తనిబంధనలో మనము కనుగొనగలము. వారు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందక పోయినను

అద్భుతరీతిగ దిగినట్లు మనము చూడ గలము. అయితే ఫిలిప్పు ఈ వరములను సమరయులకు ఎందుకు ఈయలేక పోయెను? అతడు అపొస్తులుడు కానందు వలన ఈ యద్భుత వరమును ఈయలేక పోయెనని వేంటనే మనము గమనించ గలము గద ! ఫిలిప్పు అపొస్తలుడు కానందువలన యెరూషలేము నుండి అపొస్తలులైన పేతురు, యెహోనులు రావలసివచ్చినది. అయితే అపొ కా. 19వ అధ్యాయములో ఎఫెసులో క్రీస్తు నామమున బాప్తిస్మము పొందిన ఇంచు మించు పండ్రెండుగురు పురుషుల మీద పౌలు చేతులుంచగా పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చెను. అప్పుడు వారు భాషలు మాటలాడుటకును, ప్రవచించుటకును మొదలుపెట్టిరియని మనము చదువ గలము(అపొ. కా. 19:5,8). పౌలు అపొస్తలుడగుటవలన యెరూషలేము నుండి అపొస్తలు లెవరును ఎఫెసునకు వచ్చి వారిపై చేతులుంచనవుసరము లేదని ఇక్కడ మనము గమనించగలము.

ఈ అద్భుత వరములు ఎందు నిమిత్తము ఈయబడెను? అనే ప్రశ్న మనకు ఇప్పుడు సహజముగ రావచ్చును. క్రీస్తు సంఘము మొట్టమొదట స్థాపింపబడినప్పుడు క్రొత్తనిబంధన అప్పటికింకను వ్రాయబడి యుండలేదు. సంఘము స్థాపింపబడిన మొదటి 65-70 సంవత్సరముల కాలములో క్రొత్త నిబంధన లిఖింపబడెను. అది దేవునిచే ఏర్పరచు కొనబడి దైవావేశముగల వారిచే లిఖింప బడెను. క్రొత్తనిబంధన లిఖింపబడు సందర్భములో ఈ యద్భుతవరములు అవుసరమాయెను.

క్రొత్తనిబంధన పూర్తిగ వ్రాయబడక పూర్వము నమ్మకమైన వారు దేవుని వాక్యమును అద్భుతరీతిగ బోధించుటకు ఈ వరములు సహాయపడెను. ప్రవచించు వాడు సంఘమునకు క్షేమాభివృద్ధియు, హెచ్చరికయు, ఆదరణయుకలుగునట్లు ప్రవచించెను (1 కొరింథి 14:3). ఇంకొక మాటలో క్రొత్తనిబంధన సంఘములో ప్రవచించు వ్యక్తి అద్భుతరీతిగా దేవుని వాక్యమును బోధించు వ్యక్తియని మనము గ్రహించవలెను. నేడు మనకు లిఖిత పూర్వకముగా యున్న రీతిగ క్రొత్తనిబంధన ఆనాడు వారికి లేనందున దైవావేశము వలన కలుగు ఈ బోధ సంఘమునకు ఆత్యవుసరమై యుండెను.

దేవుడు అద్భుతరీతిగ తన చిత్తము ను ఎవరిద్వారానైన బయలు పరచినప్పుడు అట్టివారికి అద్భుత సూచకముల నిచ్చెను. ఆయన మోషేకొక చేతికర్ర నిచ్చెను. ఏలియా ఆకాశమునుండి అగ్నిని రప్పించ గలిగెను. యేసుక్రీస్తు అనేక అద్భుతములు చేసెను; అట్లే అపొస్తలులుకూడ అద్భుతము లు చేసియుండిరి. అందువలన ఈ క్రొత్త

నిబంధన వ్యక్తులుకు అద్భుత వరములు అవుసరమై యుండెను. అందుకే ఆనాడు భాషలతో మాట్లాడుట సూచకమై యుండె నని పౌలు 1 కొరింథీ 14:22లో వ్రాసెను. ఈ యద్భుతములు, సూచక క్రియలు వలన ప్రభువు తన వాక్యమును స్థిరపరచు చుండెను. (మార్కు 16:17-20).

అయితే ఈయద్భుత వరములు ఎంతకాలము మట్టుకు అవుసరమై యుండెను? అనే ప్రశ్న మనకు ఇప్పుడు రావచ్చును. అసలు ఈయద్భుతవరములు ఎందునిమిత్తము ఈయబడెనో మనము గ్రహించుకొనినయెడల, అవి ఎంత కాలము మట్టుకు అవుసరమై యుండెనో తెలిసికొనుట పెద్ద కష్టమేమియును కాదు.

క్రొత్త నిబంధన లిఖిత పూర్వకము గా ఈయబడనప్పుడు దేవుని వాక్యము యధార్ధముగా దేవుని వాక్యమేయని స్థిరపరచబడుటకు అద్భుతములును, సూచకక్రియలు అవుసరమై యుండెను. అట్లయిన క్రొత్తనిబంధన గ్రంథము ఎప్పుడయితే సంపూర్తిగ వ్రాయబడెనో అప్పుడే ఈ యద్భుతవరములన్నియును నిలిచిపోయెనని మనము ఇట్టె గ్రహించు కొనగలము. ఈ యద్భుత వరములు తాత్కాలికమనియు అవి నిలిచిపోవున నియు క్రొత్తనిబంధన బోధించుచున్నది. "ప్రేమ శాశ్వతకాల ముండును. ప్రవచనములైనను నిరర్ధకములగును; భాషలైనను నిలిచిపోవును. జ్ఞానమైనను నిరర్ధకమగును. పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణముకానిది నిరర్ధక మగును" అని 1 కొరింథీ 13:8-10లో అపొ. పౌలు వ్రాసెను. గనుక సర్వ సంపూర్ణమైన క్రొత్తనిబంధన లిఖిత పూర్వకముగా ఈయబడగానే అసంపూర్ణములైన అద్భుత వరములన్నియును వాటి ప్రయోజనము ఇక లేదు గనుక నిలిచిపోయెనని మనము గ్రహించుకొన గలము.

ఈయద్భుతవరములన్నియును మొదటిశతాబ్దపు అంతములోనే నిలిచి పోయెనని చెప్పుకొనుటకు మరొక ఋజువున్నది. అదేమంటే - ఈ యద్భుత వరములు అపొస్తలులు చేతులుంచుట ద్వారా కలిగెను గనుక, అపొస్తలులు అందరు చనిపోగానే, ఈవరములు మరొకరికి అనుగ్రహించు అవకాశము లేకపోయెను. అపొస్తలులు చనిపోయే సరికి క్రొత్తనిబంధన సంపూర్తిగ లిఖింప బడెను. దేవుని వాక్యము స్థిరపరచబడి మనకు ఈయబడెను. గనుక దేవుని వాక్యము స్థిరపరచబడి మనకు ఈయ బడెను. గనుక ఇప్పుడు అద్భుతములను చేయగల వారెవరును లేరు, సరిగదా అద్భుతముల యొక్క ప్రయోజనమే ఈనాడు లేదు.

అందువలన ఈ రోజులలో క్రీస్తు నామమున అద్భుతములను చేయు

చున్నామని, భాషలు మాటలాడు చున్నామని, రోగులను స్వస్థపర్చు చున్నామని చెప్పుకొనువారు మొదటి శతాబ్దములో దేవుడు అద్భుత వరములను ఎందు నిమిత్తము యిచ్చెనో ఎరుగక పొరబడు చున్నారు. మనము అద్భుతముల ద్వారా, సూచకక్రియల ద్వారా ఈనాడు రక్షణ పొందవలెనని కాదు గాని క్రీస్తు సువార్తను వినుటద్వారా రక్షణ పొందవలెనని ఆయన కోరుచున్నాడు. క్రీస్తు దేవుని కుమారుడని నమ్మి, నీ పాపముల నిమిత్తము మారుమనస్సు పొంది, ఆయనను ఒప్పుకొనుచూ పాపక్షమాపణ నిమిత్తము నీవు బాప్తిస్మము పొందినయెడల పరిశుద్ధాత్మ అను వరమును ఆయన నీకు అనుగ్రహించును (అపొ.కా. 2:38). నమ్మి బాప్తిస్మము పొందిన ప్రతివానికి దేవుడు అనుగ్రహించు పరిశుద్ధాత్మ అను వరమును గూర్చి వచ్చే సంచికలో తెలిసికొందము.

## ఆత్మల సంపాదన
## (Soul Winning)

క్రీస్తు కొరకు ఆత్మల సంపాదనను గూర్చి అనేక గ్రంథాలు వ్రాయబడ్డాయి. వ్యక్తిగత సువార్త సేవను గూర్చి కూడ అనేక పుస్తకాలు వ్రాయబడ్డాయి. అయితే ఆత్మలు సంపాందిచుటను గూర్చి వ్రాయబడకుండా స్థానిక సంఘాభివృద్ధి అనే అంశాన్ని మనం ముగించేయలేము. దేవుని రాజ్యములో అత్యున్నతమైన పని ఆత్మల సంపాదన. అందువలన ఈ అంశమునకు కొన్ని సూక్ష్మసూత్రములను ఇప్పుడు చెప్పుకొందాము.

**నశించిన ఆత్మలను గూర్చిన ఆసక్తి :**

ఆత్మలను సంపాదించే ఆసక్తి కలిగియున్నపుడు మన ప్రభువు 12 మంది శిష్యులకిచ్చిన హెచ్చరికను గుర్తుంచుకోవాలి. పరిమితి గల ఆజ్ఞలను వారికిస్తు, "ఇదిగో తోడేళ్ల మధ్యకు గొఱ్ఱెలను పంపినట్టు నేను మిమ్మును పంపుచున్నాను గనుక పాములవలె వివేకులును పావురములవలె నిష్కపటులునై యుండుడి" యని ఆయన చెప్పారు (మత్తయి 10:16).

"నీతిమంతులు ఇచ్చు ఫలము జీవ వృక్షము. జ్ఞానము గలవారు ఇతరులను రక్షించుదురు" అని జ్ఞానియైన సొలొమోను చెప్పాడు (సామె 11:30). "బుద్ధిమంతులైతే ఆకాశమండలములోని జ్యోతులను పోలినవారై ప్రకాశించెదరు. నీతిమార్గము ననుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులకు త్రిప్పుదురో వారు నక్షత్రములవలె నిరంతరము ప్రకాశించెదరని"

దానియేలు ప్రవాసాడు (దానియేలు 12:3).

ఈలోకమంతటికంటే ఒక్క ఆత్మ యొక్క విలువ గొప్పదని మన ప్రభువు చెప్పారు. గనుక ఈలోకాన్నంతటిని సంపాదించుటకంటె ఒక్క ఆత్మను సంపాదించుట గొప్పదని ప్రభువు ఉద్దేశించారు. ప్రభువు చెప్పిన ఉద్బోధలన్నీ ఆత్మల రక్షణార్థమై చెప్పబడినవే. యోహాను 15:16లో ఆయన గొప్ప మాదిరిని మనకు చూపించారు. "నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును; ఫలించు ప్రతితీగెమరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసి వేయును" (యోహాను 15:7). ఆత్మలను సంపాదించుట ద్వారా మనం క్రీస్తుకు ఫలములు ఫలిస్తాము.

నశించిన ఆత్మలను రక్షించు నిమిత్తము మనకు అమితాశక్తియుంటేనే గాని మనం వారిని రక్షకుని యొద్దకు నడిపించలేము. ప్రమాదవశత్తు మనం ఆత్మలను రక్షించలేము. దానికి దృఢ నిశ్చయము అవుసరము.

**నశించిన వారి యెడల మన స్వభావము:**

సరియైన మనస్తత్వము లేనందున 85 శాతం అపజయమలు సంభవించునని చెప్పబడినది. అంటే సరియైన మనస్తత్వ ముంటే మనం అన్నిటిలోను విజయం సాధించగలమని దాని యర్థము. క్రీస్తు కొరకు ఆత్మలను రక్షించాలంటే మనం ఎవరిని సంపాదించాలను కొనుచు న్నామో వారి యెడల మంచి స్వభావము కలిగియుండాలి. దేవుని కుమారుని సువార్తను వారు అంగీకరించుటలో సత్యం విషయంలో మనము యేమీ తగ్గవలసిన పనిలేదు. తమ దగ్గర బంధువులను క్రీస్తులోనికి మార్చుట ఎట్లోయని సభ్యులు తరుచు తమ బోధకులనడుగుదురు. "వారి మనస్సు దెబ్బతగుల కుండా చూడుము" అని బోధకుడు సలహా నిస్తాడు. కఠినంగా ఇతరులతో వాదించుట వలన వారు క్రీస్తులోనికి రాకుండా పోతారు. గనుక ఇందు విషయమై జాగ్రత్తవహించాలి.

**నమ్మకము కలిగించాలి :**

మనం ఎవరినైనా క్రీస్తులోనికి మార్చక ముందు వారి యొక్క విశ్వాసాన్ని చూరగొనాలి. మనలో వారికి నమ్మకము లేకపోతే ఎవరు మన మాటవినరు. మన యదార్థతను వారు ప్రశ్నించే పరిస్థితిలో యుంటే, మనం చెప్పేది వారు ఇట్టే త్రోసిపుచ్చుతారు. "నాయందు విశ్వాసముంచు ఈ చిన్నవారిలో ఒకనిని అభ్యంతరపరచువాడెవడో, వాడు మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రంలో ముంచివేయబడుట వానికి మేలు" అని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 18:6).

**మాదిరి యొక్క ప్రాముఖ్యత :**

"మీరు లోకమునకు వెలుగై యున్నారని" యేసుచెప్పారు (మత్తయి 5: 14). చీకటిలో యున్నవారు నడిపింపు కొరకు మీవైపు చూచుచున్నారు. అది వారికి తెలియకపోవచ్చును, గాని వారు మీ వైపు చుచుచున్నారు. మీ జీవితాన్ని వారు చూస్తు మీవైపు ఆకర్షించబడు చున్నారు. మీ అసలైన విలువను వారు త్వరలో గమనిస్తారు. అపొ. పేతురు ఇట్లు చెప్పాడు:

"నిర్మలమైన మనస్సాక్షిగలవారై మీలో ఉన్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతివానికిని సాత్వికము తోను భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి, మీ హృదయములయందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్టించుడి; అప్పుడు మీరు దేని విషయమై దుర్మార్గులని దూషింపబడుదురో దాని విషయమై క్రీస్తునందున్న మీ సత్ప్రవర్తన మీద అపనిందవేయువారు సిగ్గుపడుదురు" (1 పేతురు 3:15-16).

**అపొ. పౌలు ఇట్లు చెప్పాడు :**

" మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య నిరపరాధులును, నిష్కళంకులును అనింధ్యులునైన దేవుని కుమారులగునట్లు సణుగులును సంశయములునుమాని సమస్తకార్యములను చేయుడి. అట్టి జనము మధ్యను మీరు జీవవాక్యమును చేత పట్టుకొని లోకమందు జ్యోతులవలె కనబడుచున్నారు. అందువలన నేను వ్యర్థముగా పరుగెత్త లేదనియు నేను పడినకష్టము నిష్ప్రయోజనము కాలేద నియు క్రీస్తు దినమున నాకు అతిశయ కారణము కలుగును" (ఫిలిప్పీ 2:14-16).

**మొదటిగా కలయిక :**

మొదటిగా ఎవరినైనా కలసినప్పుడు దాని స్మృతులు మంచివైతే మంచి ఫలితము లు సాధ్యమగును. మనము కలిసినవారిని క్రీస్తులోనికి మార్చుటయే మన మొదటి ధ్యేయము. చిరునవ్వుతో సంభాషించిన యెడల మనము క్రొత్తగా కలసిన వారికి సత్యమును బోధించుట సులభమగును. మనం ఎవరినైనా కలిసికొనిన వెంటనే యేసుక్రీస్తును గూర్చి చెప్పేయనక్కర్లేదు. మొదట్లో వారిని పరిచయం చేసుకొని, దానిని పెంచుకొని తదుపరి సువార్త బోధించవచ్చును.

**ఇంటింటా సువార్త :**

ఇంటింటా సువార్త చెప్పునపుడు, మర్యాద పూర్వకముగా ఒక యింటివారిని సంఘరాధనలకు ఆహ్వానించాలి. సువార్త కూటములు జరుగుచుయుంటే దాని సంబంధమైన కరపత్రములు వారికిచ్చి ప్రత్యేకముగా వారిని ఆహ్వానించాలి. కొన్ని సందర్భాలలో ఆయా గృహాల్లో యుండే వారు ఇట్టి విషయాలను గూర్చి చిరాకు

పడ్డారు. అలాగు జరిగినప్పుడు అతి వినయముగా అక్కడ నుండి సెలవు తీసికొనాలి. ఒక వేళ ఆ గృహస్థులు నిన్ను ఆహ్వానించి లోపలికి పిలిచిన యెడల వారితో మృదువుగా సంభాషించాలి, మీ ఆరాధన స్థలమును, సమయములను వారికి తెలియజేయాలి. వారు లోపలికి ఆహ్వానించారని గంటల తరబడి ఆ యింట్లోనే వుండరాదు. యిది నిన్ను గూర్చి వారికి దురభిప్రాయమును కలుగజేయును.

ఇంటింటా సువార్త చేయునప్పుడు నీ విజిటింగ్ కార్డు వుంటే వారికిచ్చుట మంచిది. తదుపరి అయింటిలోని వారి పేరు అడ్రసు తీసికొని నీవు దర్శించు గృహములవారి రికార్డును నీవు వ్రాసి యుంచుకోవాలి.

మీ సంభాషణ :

ఇంటింటా కలిసికొనిన వారితో సిద్ధాంతపరమైన వాగ్వాదము ఎన్నడు పెట్టుకోరాదు. ఇంటివారు నిన్ను వాగ్వాదములోనికి దింపకుండా జాగ్రత్తపడాలి. వారేమైనా ప్రశ్నవేస్తే జవాబు చెప్పుటకు సంశయించవద్దు. అయితే నీ జవాబు వాగ్వాదమునకు దారితీయకుండా చూచుకోవాలి. నీ పని అంతా వారిలో సత్యమును గూర్చిన ఆసక్తిని రేకెత్తించడమే. సంఘారాధనలకు హాజరగుట ప్రాముఖ్యమని వారు గ్రహించేలాగున చేయడమే గాని వారిని ఇరకాటంలో పెట్టి మానసిక ఇబ్బందికి గురిచేయడం కాదు. కొన్ని సందర్భాల్లో నీవు దర్శించుచున్న వారు క్రీస్తు సంఘాన్ని గూర్చి దురభిమాన ద్వేషమును ప్రదర్శించ వచ్చును. నీవు ఓపికతో వారి దురభిప్రాయములను దూరపరచాలి. మరల నీవు దర్శించు చున్నవారు సత్యమును గూర్చి ఆసక్తి చూపినట్లయితే దానిని కొనసాగించుట కొరకు కొన్ని సువార్త పత్రికలను పుస్తకములను వారికి ఇయ్యాలి. అవి ఇప్పుడు సత్యవాణి ఆఫీసులో లభించు చున్నాయి. మరియు బైబిలు కోర్సులలో కూడ వారిని చేర్చాలి.

నీవు మంచి పుస్తకములు కరపత్రములతో సిద్ధపడి యుండుట అవసరం. వారు చదివిన కరపత్రమును గూర్చి, వినిని సందేశములను గూర్చి వారికి వచ్చే ప్రశ్నలకు, వాదములకు జవాబిచ్చుటకు నీవు సిద్ధపడియుండుట అత్యవసరము. అన్నిటికంటే ముఖ్యముగా నీవు పంచే కరపత్రములు, పుస్తకములు నీవే ముందు చదువుకొని యుండాలి.

ఆత్మలను సంపాదించువాడు దేవుని వాక్యాన్ని బాగుగా ఎరిగిన వాడై యుండాలి. డాక్టరు తాను విచారించే రోగమును గూర్చిన అవగాహన లేకపోతే సరియైన మందులు వ్రాయలేడు కదా. అట్లే ఆత్మలను సంపాదించువాడు

కూడను. గనుక బైబిలు ఏమి చెప్పుచున్నదో మనం ఎరిగియుండాలి. దానిని అతి వినయంగా సవిస్తరంగా ఇతరులకు చెప్పుటకు సిద్ధపడియుండాలి.

కొన్ని సలహాలు – చేయతగనివి:

1. ప్రజలను కలయునప్పుడు కఠినముగా యుండరాదు.
2. కోపబుద్ధిని ఎన్నడు ప్రదర్శించవద్దు.
3. జవాబిచ్చునప్పుడు నీ స్వరమును గట్టిగా వినిపించకు.
4. నీవు మాట్లాడుచున్నవారికంటే నీవు శ్రేష్ఠుడవనే అభిప్రాయము కల్పించవద్దు.
5. నీ యభిప్రాయములను ఇతరులపై రుద్దుటకు ప్రయత్నించవద్దు.
6. ఇబ్బందికరమైన వాదములకు దిగవద్దు. నీవు బోధించునప్పుడు శాంతముగా బోధించు.
7. నీవు దర్శించిన వ్యక్తి యేమీ ఎరుగడు అనే యభిప్రాయమును అతనికి కల్పించ వద్దు, నీవు కూడ అనుకోవద్దు.
8. నీవు చెప్పినట్లు చేయకపోతే అతడు నరకానికిపోతాడు అనే యభిప్రాయమును కల్పించవద్దు.
9. నీవు కలసికొన్న మొదటినాడే అతనిని మార్చుటకు ప్రయత్నించవద్దు.
10. ఆ వ్యక్తిని మరల మరల కలసికొనుటకు నీకు సమయం, తీరిక లేదనే అభిప్రాయాన్ని అతనికి కలుగజేయవద్దు.

చేయదగినవి :

1. ఎల్లప్పుడు గౌరవ పూర్వకముగా కలసికోవాలి.
2. ఎదుటివాని నమ్మకములను గౌరవించు.
3. అన్నివేళలా స్నేహపూర్వకముగా, మర్యాదగా ప్రవర్తించు.
4. ఎదుటి వాని నమ్మకములను అర్థము చేసికో,
5. నీవు కలసికొన్న వారి యందు ఆసక్తి కనుబరచు.
6. అతనికి మేలు చేయుటకే ఎల్లవేళలా ప్రయత్నించు.
7. అతని గూర్చి సాధ్యమైనంత ఎక్కువ తెలిసికో.
8. సత్యములోనికి నడిపించుటకే ఎల్లప్పుడు ప్రయత్నించు.
9. మరల మరల కలసికొనులాగున నీ కలయికను ముగించు.
10. కరపత్రములు, వగయిరాలు లేకుండా వెళ్లవద్దు.

– L.R విల్సన్

# రిబ్కా, పరలోకంలో కుదర్చబడిన సంబంధము

## (Rebekah, a match made in Heaven)

## ఆదికాండము 24:12-54

వృద్ధాప్యంలో యున్న అబ్రహాము తన కుమారుడైన ఇస్సాకుకు ఒక భార్యను వెదుకుటకు తన సేవకుడైన ఎలీయాజరును నాహోరుకు పంపించెను. తాను కాపురమున్న కనానీయుల కుమార్తెనుగాక తన స్వదేశమందున్న బంధువులలో నుండి ఇస్సాకుకు భార్యను వెదుకుమని అబ్రహాము కోరెను. ఈ విషయములో దేవుని నడిపింపు కొరకు ఆ దాసుడు దేవుని ప్రార్థించెను. తాను అడుగగానే తనకును తన ఒంటెలకును నీళ్ళు పెట్టెదనని ఏ చిన్నది చెప్పునో ఆమెయే ఇస్సాకుకు దేవుడేర్పరచినదై యుండును గాక యని అతడు ప్రార్థించాడు. నీళ్ళ బావి యొద్దకు అందమైన చిన్నది ఒకతె వచ్చుట ఎలియాజరు చూచెను. ఆ సేవకుడు ఆమెను ఎదుర్కొనుటకు పరుగెత్తి, నీ కడవలో నీళ్లు దయచేసి నన్ను త్రాగనిమ్మని ఆమెను అడిగెను. ఆమె సంతోషముతో అతనికిని, అతని ఒంటెలకును నీళ్లు చేది పోసెను. ఆయువతి అబ్రాహాము సంతతికి చెందినదని ఆ సేవకుడు కనుగొని, ఆరాత్రి బసచేయుటకు స్థలము కొరకు అడిగెను. అనాటి సంప్రదాయ ప్రకారము లాబాను అతనికి గొప్ప అతిథ్య మిచ్చెను. లాబాను ఏలియేజరును తన యింటికి తోడుకొని వెళ్లి, ఒంటెలకు ఆహారమిచ్చి, తన అతిథి కొరకు భోజనము సిద్ధము చేయించెను. ఎలియాజరు భోజనము చేయుటకు ముందే తాను వచ్చిన పనిని గూర్చి వారికి తెలియజేసెను. తానెవడో, నాహోరు పట్టణమునకు ఎందుకు వచ్చాడో అతడు వారికి వివరించాడు. ఇస్సాకును వివాహమాడుటకు రిబ్కాను తీసికొని వెళ్లెదనని అతడు చెప్పెను. వివాహ సంబంధమైన ఒప్పందము కుదిరిన తరువాత ఎలియాజరు తాను తీసికొని వెళ్లిన బంగారము, వెండి, వస్త్రములను ఆమెకు బహూకరించెను. మరియు ఆమె సహోదరునికిని తల్లికిని విలువగల వస్తువులు ఇచ్చెను. అప్పుడ తడును అతనితో కూడ నున్న మనుష్యులును అన్నపానములు పుచ్చుకొని అక్కడ రాత్రి అంతయు గడిపిరి.

**ఆదికాండము 24:56-57:**

వారు ఉదయమున లేచినప్పుడు రిబ్కాను తోడుకొని తన యజమానుని యొద్దకు తిరిగివెళ్ళుటకు సెలవిమ్మని అడిగెను. అయితే వారి తిరుగు ప్రయా

ణమును సాధ్యమైనంత మట్టుకు ఆల స్యము చేయాలని రిబ్కా కుటుంబస్థులు కోరిరి. రిబ్కా వెళ్లిపోయిన తరువాత ఆమెను మరల చూడ మేమోయనే తలంపు వారికి కలిగెను. రిబ్కాను తమ ఇంటిలో మరొక పది దినముల మట్టుకు ఉండనిమ్మని వారు కోరారు. అనేక దినములు అక్కడ కనిపెట్టుటకు ఎలీయాజరుకు యిష్టమవలేదు, గనుక ఇంతకుముందు చెప్పినదే మరల వారికి చెప్పెను. గనుక ఎప్పుడు బయలు దేరవలెనో దానిని వారు రిబ్కాకు వదిలిరి. రిబ్కాను పిలిచి, నీవు ఈ మనుష్యునితో కూడ వెళ్లెదవా? అని ఆమెనడిగినప్పుడు ఆమె వెళ్లెదననెను. ఇస్సాకును పెండ్లి చేసికొందువా? యని లాబాను అడుగ లేదు. అది అప్పటికే నిశ్చయించబడెను. రిబ్కా తన సామగ్రిని సర్దుకొని, ఆమెయు, ఆమెదాదియు ఆమె పనికత్తెలును లేచి ఒంటెలనెక్కి ఎలీయాజరుతో వెళ్లిరి. ఆమె బంధుమిత్రులను, కుటుంబమును విడిచి తానెరుగని ప్రదేశమునకు, తాను మున్నెన్నడు చూడని మనుష్యుని వివాహ మాడుటకు బయలు వెళ్లెను.

వారిని తీసికొని పెద్ద ఒంటెల మంద మెసపొతామియ నుండి కానానుకు బయలు వెళ్లెను. వారు కానానుకు రాగా ఇస్సాకు వారిని చూచి వారిని ఎదుర్కొని కలసికొనెను. రిబ్కా కన్నులెత్తి ఇస్సాకును చూచినప్పుడు ఒంటెమీద నుండి దిగెను. వారు కానానుకు రాగా ఇస్సాకు ఆమెను భార్యగా స్వీకరించెను. ఆమె అతనికి భార్య ఆయెను. అతడు ఆమెను ప్రేమించెను. అతడు తన తల్లి విషయమై దు:ఖనివారణ పొందెను అని ఆదికా 24:67 చెప్పు చున్నది.

**ఆదికాండము 25:20-28 :**

ఇంచుమించు ఇరవై సంవత్సరము తరువాత రిబ్కాను గూర్చి బైబిలులో మనం మరల చదువగలము. ఆమె దరపున కుమారుని కొరకు ఇస్సాకు దేవుని ప్రార్థించుట మనకు అక్కడ కనబడతాది. దేవుడతని ప్రార్ధన ఆలకించెను. రిబ్కా గర్భము దాల్చెను. ఆమె కడుపులో ఇద్దరు కుమారులుండిరి. జ్ఞానము కొరకు ఆమె దేవుని ప్రార్థించెను. ఆమె కవలలకు జననమిచ్చునని దేవుడామెకు తెలియ జేసెను. ప్రసవదినమున ఏశావు మొదట బయటికి వచ్చెను. అతడు ఎర్రని వాడును, ఒళ్లంతయు రోమములతో నిండి యుండెను. తరువాత యాకోబు ఏశావుమడిమెను పట్టుకొని బయటికి వచ్చెను. ఏశావు తన తండ్రి వలె వేటాడుట యందు నేర్పరియై అరన్యవాసిగా యుండెను. యాకోబు సాధువై గుడారములలో నివసించుచుం డెను. అతడు గొర్రెలను మేపుచు యింటి పట్టున యుండెను. ఏశావు యాకోబులు ఇద్దరు వేర్వేరు మనస్తత్వము గలవారు.

ఇస్సాకు ఏశావును, రిబ్కా యాకోబును ఇష్టపడేవారు.

**ఆదికాండము 27:1-28:5 :**

ఇస్సాకు వృద్ధుడై దృష్టిమాంద్యము గలవాడాయెను. అతడు ఏశావును పిలిచి తన కొరకు వేటాడి మాంసము తెచ్చి తనకు యిష్టమైన రుచిగల భోజనము సిద్ధపరచిన యెడల అతని నాశీర్వదించెదనని చెప్పుట రిబ్కావినెను. తాను మరణించక ముందు ఏశావును ఆశీర్వదించాలని ఇస్సాకు కోరెను. అయితే రిబ్కా యాకోబును పిలిచి నీవు మందకు వెళ్లి రెండు మేకపిల్లలను తెమ్ము. వాటిలో నీ తండ్రికిష్టమైన రుచిగల భోజనము అతనికి చేసెదను. నీ తండ్రి మృతిబొందకముందు అతడు వాటినీ తిని నిన్ను ఆశీర్వదించునట్లు నీవు వాటిని నీ తండ్రియొద్దకు తీసికొని పోవలెనని చెప్పెను. అయితే యాకోబుతో నా సహోదరుడైన ఏశావు రోమములు గలవాడు, నేను నున్నని వాడను గనుక తన తండ్రి అతని మోసమును గుర్తించునని చెప్పెను. తన తల్లి అతని తండ్రికిష్టమైన భోజ్యమును సిద్ధపరచెను. మరియు అతని చేతులను, మెడమీదను మేకపిల్ల చర్మముతో కప్పెను. ఏశావు యొక్క సొగసైనవస్త్రములు యాకోబుకు ధరింపజేసెను. ఇస్సాకు యాకోబు తెచ్చిన వంటకమును తిని, అతడే ఏశావు అనుకొని అతనిని దీవించెను. ఏశావు దీనిని తెలిసికొని తన తండ్రి మరణించిన తరువాత యాకోబును చంపుటకు పగబట్టెను. యాకోబును రక్షించుటకు రిబ్కా అతనిని హారానుకు పోయి, తన సహోదరుడైన లాబాను కుమార్తెలలో ఒకదానిని పెండ్లాడునట్లు అతనిప్రోత్సహించెను. ఇస్సాకును ఈరీతిగా ఆమె మోసగించినందున రిబ్కా మరల ఎన్నడు యాకోబును చూడలేక పోయెను. తదుపరి ఆదికాండము 49:31లో మక్పేలా గుహలో రాహేలు పాతిపెట్టుటను గూర్చి బైబిలునందు మనము చదువగలము.

**నేర్చుకొన దగిన సూత్రములు :**

**రిబ్కా జాలి, కనికరము గలది :**

ఎలియాజరు దాహమడుగగా రిబ్కా అతనికి ఒంటెలకు కూడ దాహము తీర్చెను. అతడు తన అన్నయైన లాబాను యింట నుండుటకామె బస ఏర్పాటు చేయించెను. ఆమె అడిగిన దానికంటె ఎక్కువ చేయగలిగెను (ఆదికా. 24:18 -20). "ఒకని యెడల ఒకడు దయ గలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" యని అపొ.పౌలు చెప్పెను (ఎఫెసీ 4:32). దయ, కనికరము, క్షేమాలను దేవుడు మన యెడల చూపించును. దేవునికి ఇష్టపూర్వకముగా యుండాలంటే, ఇతరుల యెడల కూడ మనము ఇట్టి

లక్షణములను కలిగి యుండాలి. క్రైస్తవులు ఎల్లవేళల దయ, క్షమాగుణము గలవారిగ యుండాలి. ఈ రెండు లక్షణములును కలిగి యుండాలి. క్రైస్తవులు ఎల్లవేళల దయ, క్షమాగుణము గలవారిగ యుండాలి. ఈ రెండు లక్షణములు కలిగి యుండుట ఒక్కోసారి కష్టమే. మన బిడ్డలతో చికాకు పడుట సులభమే. వారి మాటలు, చేష్టలు ఒక్కోసారి మనకు చికాకు కలిగించ వచ్చు. మనము తీరిక లేని ప్రపంచములో జీవించుచున్నాము. ఈ లోక సంబంధ పనులలో తలమునకలగుచున్నాము. అందువలన ఏచిన్న అసౌకర్యము కలిగినా కోపపడిపోతాము. క్రైస్తవుల క్రీస్తు యొక్క స్వభావమును ప్రదర్శించాలి. ఇతరుల యెడల జాలి కలిగి ఏమిచేయ వలెనని మీరు కోరుదురో అలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది" (మత్తయి 7:12). నీవేలాంటి గౌరవాన్ని కోరుకొందువో వరులను కూడ అట్లే గౌరవించు. నీవు రిబ్కా వలె యున్నావా? యితరులకు పరిచర్య చేయుటకు ఆతురత పడుదువా? యితరులు అర్హులు కాకపోయినను. వారిని గౌరవించి మన్నించుమని కోరుకొందువా?

**రిబ్కా కష్టపడి పనిచేయునది :**

"ఆమె బావి యొద్దకు పరుగెత్తికొనిపోయి అతని ఒంటె లన్నిటికి నీళ్ళు చేది పోసెను" (ఆదికా. 24:20). ఆమె విన్న దానిని చూచిన దానిని తన యింటి వారికి చెప్పుటకు పరుగెత్తి కొని పోయెను. రిబ్కా సోమరి కాదు. ఆమె సంతోషముతో. తన పనులను ముగించెను.

మనం ఈ లోకంలోను, క్రీస్తు రాజ్యములోను కూడ చురుకుగా యుండుటకు ప్రయత్నించాలి. సామెతలు 6:6-11లో గల, చీమల ఉదాహరణ గమనించుము. కోతకాలమై పోయినను కూడ సమృద్ధియైన ఆహారముండునట్లు చీమలు గట్టిగా పనిచేస్తాయి. చీమలు సోమరి కావు. తమ పనిని గూర్చి వాటికెవరు చెప్పనక్కర్లేదు. క్రైస్తవుల వలె మనలను ఎవరు చూచినను, చూడకపోయినను మన పనులు జాగ్రత్తగా నిర్వహించాలి. నీవు రిబ్కా వలె యున్నావా? ఎవరు గమనించకుండానే నీవు పని చేయగలవా! నీవు సంతోషముతో పనులు చేసికొంటావా!

**రిబ్కా విశ్వాస ధైర్యములు ప్రదర్శించెను:**

ఆమె యిష్టపూర్వకముగానే తన యింటిని, నెళవైన వారినందరిని విడిచి తానెరుగని క్రొత్త ప్రదేశమునకు వెళ్లెను. ఆమె భవిష్యత్తును గూర్చి, తెలియబడని దానిని గూర్చి భయపడలేదు (ఆదికా. 24:57-58). ఆమె ఆశావాహారాలు,

నిరాశపరురాలు కాదు.

"విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటి యొక్క నిజస్వరూపమును అదృశ్యమైనవి యున్న వనుటకు రుజువునై యున్నది" యని హెబ్రీ 11:1 చెప్పుచున్నది. దేవుని యందలి ప్రగాఢమైన విశ్వాసము తానెరుగని సందర్భములో భయాందోళనలు లేకుండా ప్రవేశింప జేయును. దేవుని యందున్న మన విశ్వాసము ఈ జీవిత భయాందోళనలను అధిగమించడానికి సహాయపడును.

దేవుని యందు విశ్వాసముంచుట యొక్క ప్రాధాన్యతను నేటి ప్రజలు గుర్తించాలి. మన జీవితంలో ఆయనకు ప్రధానస్థానం యిస్తే దేవుడు మనకు తప్పక సహాయం చేయును (మత్తయి 6:25-34). మనకు కీడేమీ సంభవించదని దీనియర్థము కాదు గాని, చివరకు మనం పరలోక గృహం చేరుకోగలము. ఆలాగున దేవుడు మనలను సంరక్షించును.

నీవు రిబ్కావలె యున్నావా? క్రొత్త వాతావరణములో ప్రవేశించుటకు నీకు సరిపడినంత విశ్వాసమున్నదా ?

**రిబ్కా ప్రార్థన పరురాలు :**

ఆమెకు సంతాన ప్రాప్తి కలుగునట్లు ప్రార్థించుమని ఆమె ఇస్సాకును ప్రోత్సహించెను (ఆదికా 25:21). "యెడ తెగక ప్రార్థన చేయుడి; ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసు క్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము" (1థెస్స5:16-18). ఈ లోకంలో యుండగా క్రైస్తవులు ధరించుకొను రక్షణ కవచములో ప్రార్థన ఒక భాగమై యున్నది (ఎఫెసీ 6:17). ప్రార్థనలో మనం దేవునికి కృతజ్ఞత చెల్లించాలి (ఫిలిప్పీ 4:6). స్తుతి చెల్లించాలి (హెబ్రీ 13:15), సహాయం కొరకు అభ్యర్థించాలి (ఫిలిప్పీ 1:4). పాపముల విషయమై క్షమాపణ నడగాలి (అపో.కా. 8:32).

**రిబ్కా వివక్షత చూపించింది :**

ఇస్సాకు ఏశావును ఇష్టపడుచుండగా, రిబ్కా యాకోబు యెడల ఇష్టాన్ని కలిగి యుండినది. ఈ పక్షపాత ధోరణి వలన యాకోబు తన తండ్రిని మోసంగించునట్లు ప్రోత్సహించినది. ఈ కవలలు జన్మించక ముందే ఏశావు యాకోబుకు దాసత్వము చేయునని ఆమె ఎరుగును. తన అత్తయైన శారావలె రిబ్కా కూడ ఇశ్రాయేలు జనాంగమును గూర్చిన దేవుని సంకల్పములో సహకరించింది. గనుక ఇస్సాకు యాకోబును ఆశీర్వదించునట్లు అతని కళ్లు గప్పి మోసానికి పాల్పడింది. యాకోబు వయసు వచ్చిన వాడైనను తనతల్లి చెప్పినట్లు నడుచుకొన్నాడు. అందువలన తన తండ్రినే మోసగింపవలసి వచ్చినది. తన అన్న అతనిని ద్వేషించు

నట్లు చేసింది మరియు కుటుంటములో విడిపోవలసి వచ్చినది. ఇదంతయు తల్లి తన కుమారులలో చూపిన వివక్షత వలన కలిగినది.

విచారం యేమంటే, రిబ్కా యాకోబుల నుండి నేటి ప్రజలు అనేకులు పాఠములు నేర్చుకోలేదు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయమై వివక్షత చూపితే, పిల్లల మధ్య అసూయ, ఈర్ష్య ప్రారంభమవుతాది. సంఘములోనే క్రైస్తవులు ఇట్టి వివక్షతను చూపుదురు. ఆయా ప్రజలకున్న తలాంతులను బట్టి మనం వివక్షతను చూపుదురు. ఆయా ప్రజలకున్న తలాంతులను బట్టి మనం వివక్షత చూపితే పక్షపాతులమగుదుము. అయితే దేవుడు పక్షపాతి కాడు (రోమా 2:11). గనుక మనం ఎవరి యెడల వివక్షత కలిగి యుండ కూడదు.

నీవు రిబ్కావలె యున్నావా? నీకుటుంబ సభ్యుల యెడల, సంఘ సభ్యుల యెడల వివక్షత కలిగి యున్నావా? రిబ్కా యెహెూవా దేవుని యందు గొప్ప విశ్వాసము గల ఘనురాలు. మనందరి వలె అప్పుడప్పుడు ఆమె తడబడింది. ఆమె యొక్క ప్రభావము వలన తన కుటుంబములో భేదములు కలిగినవని జ్ఞాపక ముంచు కొందము. ఈ సంగతులన్నిటిని బట్టి నీ తలంపులను, కుటుంబ సభ్యుల యెడల, సంఘ సభ్యుల యెడల నీ ఆదరాభిమానములను జాగ్రత్తగా కాపాడు కొనుమని హెచ్చరించుచున్నాను (1కొరింధీ 15:33). నీ జీవితంలో రిబ్కా లక్షణము లేమైనా యున్నవా? నీ లక్షణములలో దేనినైనా మెరుగు పరచుకోవలెనా? కొన్నింటిని నిర్మూలించవలెనా? పరీక్షించుకొనుము.

## ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము ?

## ( How shall we Escape if we neglect so great salvation ?)

"ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము?" (హెబ్రీ 2:3).

దేవుని వాక్యమును విని విడిచి పెట్టకూడదని మనకు హెచ్చరిక చేయబడినది.

"కావున మనము వినిన సంగతులను విడిచి పెట్టికొట్టుకొని పోకుందునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగి యుండవలెను" (హెబ్రీ 2:1). మనము విన్నానంగతులు మన మనస్సులో నుంచుకోవాలిగాని కొట్టుకొని పోనీయ

కూడదు. ప్రతిచోట ప్రతి సందర్భములో దేవుని వాక్యమును గట్టిగా పట్టుకొని యుండాలి. కొట్టుకొనిపోనీయ కూడదు. దేవుని రాజ్యమును వెదకుటే మానవుని ప్రాథమిక విధి (మత్తయి 6:33; ప్రసంగి 12:13). క్రీస్తును సంపాదించుకొనుటకు మనం సమస్తాన్ని నష్టముగా ఎంచుకోవాలి (ఫిలిప్పీ 3:7-8).

దేవుని వాక్యమును విడిచిపెట్టుటకు గల కారణములు అనేక స్థావరములనుండి వచ్చును: గ్రహింపకపోవడం ఒకకారణం (మత్త 13:19); ఐహిక విచారములు మరొకకారణం. భూమి కొనుగోలు ఎడ్లు కొనుగోలు, పెండ్లాడుట మొదలగునవి (లూకా 14:16-20). ధన భోగములు (మత్త 13:20-21). దురభిమానము (మత్త 13:15); ఈలోకాశలు, వాటి ప్రేమ (1 యోహా 2:15-17), సుఖ భోగములు (2 తిమో 3:4; 1 తిమో5:6); మనుష్యులను సంతోషపెట్టవలెననే కోరిక (గలతీ 1:10); మరియు సత్యము యెడల ప్రేమ లేకపోవుట మొదలగునవి (2 థెస్స 2:10-12).

**నిర్లక్ష్యము వలన కలుగు ప్రమాదముల హెచ్చరికలో రెండు సత్యములు :**

1. దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడి యున్నది. అది అటుయిటు కొట్టుకోనిపోవునది కాదు. స్థిరముగా యుండేది. అది ఖచ్చితం.

2. ప్రతి అతిక్రమమును, అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొంది యున్నది. అతిక్రమము అనగా హద్దుదాటి వెళ్లుట, క్రియాజనకపాపము (1యోహాను 3:4). అవిధేయత అనగా ఆజ్ఞాపింపబడిన దానికి లోబడకుండుట, అశ్రద్ధ వలన పాపము (యాకోబు 4:17). ఈ రెండు రకాల పాపములకు న్యాయమైన ప్రతిఫలము దొరికింది. న్యాయపరంగా వారు శిక్షింపబడ్డారు. "దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచి పెట్టక పాతాళలోకమందలి కటికచీకటిగల బిలములలోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను. మరియు ఆయన పూర్వకాలమందున్న లోకమును విడిచి పెట్టక భక్తిహీనుల సమూహము మీదికి జలప్రళయమును రప్పించినప్పుడు, నీతిని ప్రకటించిన నోవహును మరి యేడుగురిని కాపాడెను. మరియు ఆయన సొదొమ, గొమొఱ్ఱాలను పట్టణములను భస్మము చేసి, ముందుకు భక్తిహీనులగువారికి వాటిని దృష్టాంతముగా నుంచెను" (2 పేతురు 2:4-6). గనుక మనకనుగ్రహించిన రక్షణను నిర్లక్ష్యము చేస్తు, శిక్షను తప్పించుకొందుమని మనం భావించరాదు.

ఈరక్షణ గొప్పదైనను, మానవుడు వింటేనే గాని అది అతనికి లభించదు(హెబ్రీ 2:3).

ఆశీర్వాదముల ననుభవించాలంటే వాటిని మనం సొంతము చేసికోవాలి. గ్రంథము మంచిదే కావచ్చునుగాని ఏమైనా మేలుపొందాలంటే దాన్ని మనం చదువాలి. సూర్యుని వెలుగు చీకటిని దూరపరుస్తాది. దాన్ని చూడాలంటే మన కళ్లు తెరవాలి. తోటలో కూరగాయలు మంచివే, గాని వాటిని తింటేనే మనకు బలం. రోగానికి మందు బిళ్లలు మంచివే, గాని వాటిని మ్రింగితేనే రోగం నయమవుతాది.

క్రైస్తవ్యములో యున్న సత్యములు కూడ అంతే, అవి క్రీస్తు నుండి కలిగాయి, స్థిరపరచబడ్డాయి (హెబ్రీ 2:3). గాని వాటిని క్రీస్తు తన వంతు నెరవేర్చారు, దానికి లోబడుచు, మానవుడు తన వంతు నెరవేర్చాలి (హెబ్రీ 5:8–9).

**రక్షణను నిర్లక్ష్యము చేయువారు తప్పించుకొనలేరు :**

ఘోరనేరస్థులు మాత్రమే శిక్షింపబడుటయేగాక రక్షణను నిర్లక్ష్యము చేసిన వారందరు శిక్షింపబడుదురు. దొంగలు దోపిడీదారులు, నరహంతకులు, వ్యభిచారులు మాత్రమేగాదు, రక్షణను నిర్లక్ష్యము చేసేవారందరు మరణిస్తారు. పాప విరుగుడును నిర్లక్ష్యము చేసిన వారందరు శిక్షపాల గుదురు. నిర్లక్ష్యము మాత్రమే మానవుని నాశనం చేయును, రోగియైన వాడు ఔషధమును సేవించుటకు నిర్లక్ష్యము చేస్తే నిత్య మరణము తప్పదు.

భౌతికంగా విలువైన ప్రతి దానిని నిర్లక్ష్యము నాశనం చేస్తాది. అది పళ్లను నాశనం చేస్తాది, ఆరోగ్యాన్ని కూలదోస్తాది, స్నేహములను విడగొడ్తాది, మంచి పొలాన్ని బీడు భూమిగా చేస్తాది, వ్యాపారాన్ని కూలగొడ్తాది. అందమైన యిల్లును పాడు చేస్తాది.

**నిర్లక్ష్యము తీర్పుదినాన్న అనేకులను నాశనం చేస్తాది:**

"నిర్లక్ష్యము వహించిన వాడు యిసుక మీద తన యిల్లు కట్టుకొనును (మత్త 7:24–27).

2. సువార్తకు అవిధేయులైనవారి గతి యేమవును? అని పేతురు ప్రశ్నించుచున్నాడు (1 పేతురు 4:17). 2 థెస్స 1:7–9లో దాని జవాబున్నది: "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగని వారికిని మన ప్రభువైన యేసు సువార్తకులోబడని వారికిని ప్రతి దండన చేయును".

3. ఒకే తలాంతును పొందినవాడు నిర్లక్ష్యము వలన శపించబడ్డాడు (మత్తయి 25:41–46).

**క్రైస్తవుడు తన పిలుపును, ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు జాగ్రత్త పడాలి (2 పేతురు 1:10) :**

" అతడు తన స్వంత రక్షణను

కొనసాగించుకొనాలి (ఫిలిప్పీ 2:12). అతడు గురియొద్దకే పరుగిడాలి (ఫిలిప్పీ 3:13-14). మంచి నిర్ణయాలు గైకొంటేనే చాలదు. కృషి చేయాలి.

2. అపొస్తలులు గైకొనిన నిర్ణయాలను గూర్చి మనం పెద్దగా చదువము గాని వారి క్రియలను గూర్చి ఎక్కువ చదువుతాము.

3) ఫేలిక్స్‌వలె అనేకులు మరొక తరుణము కొరకు కనిపెట్టారు (అపొ.కా. 24 :24-25). అది ఎన్నడు రాదు. ఇదిగోఇదియే రక్షణదినము, ఇదియే అనుకూల సమయము "నేడు మీరాయన మాట వినిన యెడల మీహృదయములను కఠినపరచు కొనకుడి" (హెబ్రీ 4:7).

- లీరోయ్ బ్రౌనలో

## దేవ దూతల తత్వము
## (The Nature of Angels)

సర్వశక్తిగల మన దేవుడు తన కుటుంబముపై అధికారము కలిగియున్నారు. భూమి మీదను పరలోకములోను ఉన్న దేవుని కుటుంబమును గూర్చి పౌలు చెబుతాడు (ఎఫెసీ 3:14-15). భూమి మీద నున్న దేవుని కుటుంబమే క్రీస్తు సంఘమని మనం ఎరుగుదుము. అయితే పరలోకమందున్న దేవుని కుటుంబమును గూర్చి మనం కొంత తెలిసికొన ప్రయత్నించుదాము. దేవుని యొక్కయు, ప్రభువువైన యేసు క్రీస్తు యొక్కయు అధికారములో మన మెరుగని అనేక సంగతులున్నవి. అవి "ఆకాశమునందున్నవియు, భూమియందున్నవియు దృశ్యమైనవిగాని అదృశ్యమైనవిగాని సింహాసనములైనను, ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను" అయ్యున్నవి (కొలస్స 1:16).

శరీర రూపము దాల్చిన వాక్యమైన దేవుని ద్వారా "సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్నదేదియు ఆయన లేకుండా కలుగలేదు" (యోహాను 1:3). నీవలెను, నావలెను దేవదూతలు కూడా సృజింపబడినవారే. వారికి కూడ స్వీయ నిర్ణయాధికారమున్నది. దేవదూతలు దేవుని పనిచేయు యాంత్రిక జీవులు కాదు. కొందరు దేవ దూతలు దేవుని పరిచర్యచేయక ఆయనపై తిరుగుబాటు చేసిన వారైరి.

దేవదూతలు వార్తావాహులు అనే అభిప్రాయము హెబ్రీ భాషలో మలాక్ (Malak) అనేపదము వలన అర్థమగుచున్నది. పాతనిబంధనలో ఆపదము 108 సార్లు వినియోగించబడెను. అదే మాట గ్రీకు క్రొత్తనిబంధనలో ఏంజెలోస్ (Angellos) అను పదము 186 సార్లు

వాడబడెను. ఏంజెలోస్ అనగా వార్తా వాహుడని యర్థము. దేవుడు యోబుతో, తాను భూమికి పునాదులు వేసినప్పుడు, "దేవదూతలందరు ఆనందించి జయ ధ్వనులు చేసిరి" యని చెప్పెను (యోబు 38:4-7). దీనిని బట్టి జగత్పునాదికి ముందు నుండే దేవ దూతలుండిరియని మనము గ్రహించుకొన గలము. "నీవే అద్వితీయుడవైన యెహోవా, నీవే ఆకాశములను మహాకాశములను వాటి సైన్యమును, భూమిని దానిలో ఉండునది అంతటిని సముద్రములను వాటిలో ఉండునది అంతటిని సృజించి వాటినన్నిటిని కాపాడువాడవు. ఆకాశసైన్యమంతయు నీకే నమస్కారము చేయుచున్నది" యని నెహెమ్యా 9:6 చెప్పుచున్నది. దేవుని సృష్టియంతయు ఆయనను స్తుతించుటకొరకు చేయబడియున్నది. "ఆకాశవాసులారా, యెహోవాను స్తుతించుడి.... ఆయన దూతలారా మీరందరు ఆయనను స్తుతించుడి" (కీర్తన 148:1-2). దేవుడు కోరుచోటునకు తన వర్తమానము చేరవేయుటకు తన దూతలను వినియోగించెను. "యెహోవా దూతలారా, ఆయన ఆజ్ఞకు లోబడి ఆయన వాక్యము నెరవేర్చు బలశూరులారా, ఆయనను సన్నుతించుడి. యెహోవా సైన్యములారా, ఆయనచిత్తము నెరవేర్చు ఆయన పరిచారకులారా మీరందరు ఆయనను సన్నుతించుడి" క్రీర్తన 103:20-21).

దీనిని బట్టి దేవదూతలు ఆయన చిత్తమును జరిగించి ఆయనను సన్నుతించుదురని గ్రహించుకొనుచున్నాము. తదుపరి ఆయన చిత్తమును వ్యతిరేకించిన దూతలు కూడ లేకపోలేదు. "తమ ప్రధానత్వమును నిలుపుకొనక తమనివాసస్థలమును విడిచిన దేవదూతలను మహాదినము జరుగు తీర్పు వరకు కటికచీకటిలో నిత్యపాశములతో ఆయన బంధించి భద్రము చేసెను" (యూదా :6). తీర్పుకు ముందు, తీర్పు తరువాత కూడ తిరుగుబాటు చేసిన దూతల యొక్క పరిస్థితి విపులముగానే యున్నది. "దేవదూతలుపాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచి పెట్టక పాతాళలోకమందలి కటిక చీకటిగల బిలములోనికి త్రోసి తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" (2 పేతురు 2:4).తన చిత్త ప్రకారము చేయు దూతలను, వ్యతిరేకించు దూతలను కూడ దేవుడు సంపూర్తిగా తన ఆధీనములో ఉంచుకొని యున్నారు. సర్వశక్తుడగు దేవుని తత్వమే అది !.

**దేవదూత లెట్లుంటారు?**

భౌతిక నేత్రములతో వారిని మనము చూడలేము, అయితే అది దేవుని అభీష్టమయితే వారు కనబడతారు. సంఖ్యాకాండము 22వ అధ్యాయములో

బిలాము చూడ లేకపోయెను, దేవుని ప్రవక్తయైన ఎలీషా దోతానులో యుండగా అప్పణమంతయు శత్రు సైన్యముతో చుట్టుకొనియుండెను. అయితే ఎలీషా వారిని గూర్చి భయపడలేదు ఏలయనగా అతడు దేవుని అగ్నిగుర్రము లచేతను రథముల చేతను నిండియుండుట చూడగలిగెను గాని అతని పనివాడు చూడ లేకపోయెను. "యెహోవా, వీడుచూచునట్లు దయచేసి వీనికండ్లను తెరవుమని ప్రార్థన చేయగా యెహోవా ఆ పని వాని కండ్లను తెరవజేసెను గనుక వాడు ఎలీషా చుట్టును పర్వతము అగ్ని గుర్రముల చేత రథములచేతను నిండి యుండుట చూచెను" (2రాజులు 6:17). దేవ దూతలు ఆత్మ స్వరూపులు. "వీరందరు రక్షణయను స్వాస్థ్యము పొందబోవువారికి పరిచారము చేయుటకై పంపబడిన సేవకులైన ఆత్మలు కారా ?" (హెబ్రీ 1:14). రక్షణపొందబోవు మనకు పరిచర్యచేయుచు దేవుని సేవ చేయుట వారి పనియై యున్నది.

ఆత్మలైనదూతలకు లింగ భేద ముండదు. వారు పెండ్లాడరు, పిల్లలను కనరు, వారుఅధికారము గలవారనేభావము మనకు కల్పించుటకొరకు పురుషరూపమున వారు వర్ణించబడ్డారు. మిఖాయేలు (యూదా:9). గబ్రియేలు (లూకా 1:26) ఒకడు "నేను చేయబోవు కార్యమును అబ్రాహాముకు దాచెదనా?" వారిద్దరి పేర్లు మనకు చెప్ప బడ్డాయి. వారు మనకెట్లు సహాయపడ్డారు? పాతనిబంధనలో మోషేకు దేవుని ధర్మశాస్త్రము ననుగ్రహించుటలో వారు సహాయ పడ్డారు గత కాలములో "దేవ దూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిర పరచబడెను" (హెబ్రీ 2:2). మోషే ధర్మశాస్త్రము మధ్యవర్తి ద్వారా దేవ దూతల ద్వారా నియమింపబడెను (గలతీ 3:19). యూదుల మతగు రువులకు చెబుతు స్తెఫను కూడ ధర్మ శాస్త్రము దేవదూతల ద్వారా నియమిం పబడెనని పలికెను (అపో.కా. 7:53). దీనిని బట్టి క్రొత్తనిబంధన యొక్క శ్రేష్ఠత మనకు విశదమగుచున్నది. అది దేవ దూతల ద్వారా రాక దేవుని కుమారుని ద్వారా అనుగ్రహించబడి స్థిరపర చబడెను (హెబ్రీ 1:2).

**మరల, దేవుదూతలెట్లుంటారు? వారి రూపురేఖలు ఏమిటి?**

దర్శనములు స్వప్నముల విషయములో నైతే వారు రెక్కలు గలిగి ఎగురు చున్నట్లుగుపడిరి (దానియే 9:21; ప్రక 14:6). పరలోకములో వారట్లుగుపడు దురను కొనవచ్చును. దేవుని సేవకులైన దూతలు మనుష్య రూపమునకు భిన్న మైన రూపమునుకూడ ధరించు కొందురు. "దేవుడు తన దూతలను

(టైటిల్ 2వ పేజీలో)

వాయువులు (దూతలు) గాను తన సేవకులను అగ్నిజ్వాలలుగాను చేసికొనువాడు" (హెబ్రీ 1:7). అయితే భూమి మీద వారు రెక్కలు గలవారిగా గాక ప్రకాశమానమైన పురుషులుగా వర్ణింపబడిరి.

అబ్రాహాము దూతలకు పరిచర్య చేసెను. వారు కేవలము పురుషులనే అతడనుకొనెను (హెబ్రీ 13:2). ఆదికాండము 18:2లో అబ్రాహాము ఎదుట ముగ్గురు మనుష్యులగుపడతారు. ఆముగ్గురిలోఒకడు"నేను చేయబోవు కార్యమును అబ్రహాముకు దాచెదనా" యని పలికెను (ఆది.కా. 18:17). మరల 19:1 లో మిగిలిన ఇద్దరు దేవదూతలని చెప్పబడెను. యేసుక్రీస్తు పునరుత్థానుడైన సమయ ములో ప్రభువు దూత సమాధి మీదనున్న రాయి పొర్లించి దాని మీద కూర్చుండెను. ఆదూత స్వరూపము మెరుపువలె ఉండెను. అతని వస్త్రము హిమమంత తెల్లగా ఉండెను (మత్తయి 28:2-3). ముగ్గురు స్త్రీలు యేసు సమాధి దగ్గరకు వచ్చి చూడగా, తెల్లని నిలువుటంగీ ధరించు కొని యున్న యొక పడుచువాడు అక్కడ కూర్చుండుట వారు చూచిరి అతడు వారికొకవర్తమానము తెలియజేసెను (మార్కు 16:5-6).

ప్రభువైన యేసు పరమునకారోహణమవుచుండగా, తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు, "గలిలయ మనుష్యులారా, మీరెందుకు ఆకాశమువైపు చూచుచున్నారు? మీయొద్దనుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే ఏరీతిగా పరలోకమునకు వెళ్లుట మీరుచూచితిరో, ఆరీతిగానే ఆయన తిరిగి వచ్చుననే" వర్తమానము చాటిరి (అపొ.కా. 1:10-11). యేసుప్రభువు మరల వచ్చునప్పుడు తన దూతలతో కూడ తీర్పు తీర్చుటకు వచ్చును. "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని మన ప్రభువైన యేసు సువార్తకులోబడని వారికిని ప్రతిదండన చేయును" (2 థెస్స 1:6-8).

నిత్యత్వములో నీతిమంతులు దేవదూతలవలె యుందురు "వారు పరలోకమందున్న దూతలవలె యుందురు" (మత్తయి 22:30). – స్టూవర్ట్ ష్నూర్

---

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**– ఎడిటర్**

# మీకొకగొప్పసదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్ధులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

**Satya Vani**

#7-9-35, Sambamurth Street,
Kakinada - 533 004. Ph: 0884 - 2363722

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004